సాక్షి
పెద్దపల్లి

సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023

సెల్ఫీ విత్ మట్టిగణేశుడు

సాక్షి పెద్దపల్లి: పర్యావరణాన్ని కాపాడేలా మట్టిగణేశుడిని ప్రతిష్ఠించారా.. ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ లేదా ఇళ్లలో మట్టి గణపతులను పూజిస్తున్నారా.. అయితే మీరు పర్యావరణహిత గణేశుడితో సెల్ఫీ ఫొటో తీసుకుని సెల్ నంబరు 97002 15216కు వాట్సాప్ చేయండి. మీరు పంపిన ఫొటోను 'సాక్షి' దిన పత్రికలో ప్రచురిస్తాం.



న్యూస్‌రీల్

మల్లన్నకు పట్నాలు



పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానం సన్నిధి ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయటంతోపాటు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. మల్లికార్జునస్వామి, విఘ్నేశ్వరుడు, నందీశ్వరుడు, శ్రీసీతరామచంద్రస్వామిని దర్శించుకున్నారు. ఒగ్గు పూజారులతో పట్నాలు, బోనాలు చెల్లించారు. ఆలయ ఈవో సదయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

వినాయకుడికి పూజలు



పూజలు చేస్తున్న మక్కాన్‌సింగ్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణ కాలనీలోని పలు వినాయక మంటపాల వద్ద డీసీసీ అధ్యక్షుడు రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఆదివారం గణేశుడికి పూజలు చేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేసినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ ఎన్టీపీసీ పట్టణ అధ్యక్షుడు ఆసిఫ్‌పాషా, నాయకులు యుగందర్, మురళి, ముచ్చకుర్తి రమేశ్, సురేశ్ పాల్గొన్నారు.

కుల నిర్మూలనకు పాటుపడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రామగుండం: బలమైన వర్గ పోరాటాలతోనే కులనిర్మూలన సాధ్యమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు నంది రామయ్య అన్నారు. ఆదివారం సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెద్దంపేటలో వేడుకలు నిర్వహించారు. అనంతరం కుల నిర్మూలన, మూఢాచారాలు, మనువాద, కుల వాదాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి, పెద్దంపేట కార్యదర్శి గొల్లపల్లి చంద్రయ్య, నాయకులు తోకల రమేశ్, ఆడెపు శంకర్, పెండ్యాల రమేశ్, మార్త రాములు, గుమ్మడి వెంకన్న, కోడిపుంజుల లక్ష్మి, కట్ట తేజేశ్వర్, తీగుట్ల రాములు, నామాల పాపయ్య, మార్త రాధ, కోడిపుంజుల మహిపాల్, తీగుట్ల నవీన్, పోశం పాల్గొన్నారు.

కార్మిక పిల్లలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

- ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు



పేర్లు నమోదు చేసుకుంటున్న అభ్యర్థులు

పెద్దపల్లిరూరల్: భవన నిర్మాణం రంగ కార్మికుల పిల్లలకు సాంకేతిక రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకే కార్మిక శాఖ, సెట్విన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని సెట్విన్ ప్రతినిధి నాగేశ్వర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం సెట్విన్, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖ సంయుక్తంగా యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాయి. ఈడ్రైవ్‌లో 16 కంపెనీల్లో ఉద్యోగం సాధన కోసం 210 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 125 మందికి ఉద్యోగాలు దక్కాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: రాంమందిర్‌ఏరియా సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్, కల్యాణ్‌నగర్, శివాజీనగర్, తిరుమల్‌నగర్, ఎల్బీనగర్, మేదర్‌బస్తీ ఏరియాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పెద్దపల్లి కిషన్ తెలిపారు. లైన్ల మరమ్మతుతో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సరి'కొత్త' ఆలోచనలు



చిన్నారుల కోసం క్రిచ్ కేంద్రం



అధికారుల కోసం కాఫీ రిలాక్స్ సెంటర్



కలెక్టరేట్ సముదాయం



మహిళా సిబ్బంది భోజనశాల

పాలనలో తనదైన ముద్రవేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్.. కలెక్టరేట్ ఉద్యోగులకు సౌకర్యాల కల్పనలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. సందర్శకులకూ అసౌకర్యాలు ఎదురవకుండా ప్రత్యేక గదులు కేటాయించారు. క్యాంటీన్ అందుబాటులోకి తెచ్చారు. జిల్లా చరిత్ర, సుప్రసిద్ధ ప్రాంతాలు తెలిసేలా గోడలపై ఫొటోలు ఏర్పాటు చేశారు. సమస్త సమాచారం తెలియడంతోపాటు ఆహ్లాదం పంచే వాతావరణం కల్పించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



ధరణి హెల్ప్‌లైన్..



గోడపై చారిత్రక చిత్రాలు



ప్రజావాణి కౌంటర్లు



ఆకట్టుకునే స్వాగత తోరణం



రైతుల కోసం పంట రుణమాఫీ సెంటర్



కలెక్టరేట్‌లోని క్యాంటీన్



గోడపై ఫొటో ప్రదర్శన ఇలా..

లక్ష్యం ఘనం.. అవగాహన శూన్యం

- 'హార్టికల్చర్'లో అధికారుల కొరత
- ముందుకు సాగని ఆయిల్‌పామ్ సాగు
- లక్ష్యం 10వేల ఎకరాలు.. సాగు చేసింది 800 ఎకరాల్లోనే..
- జిల్లాలోని 14 మండలాలకు ఇద్దరే ఉద్యానవన అధికారులు
- అన్నదాతలకు సకాలంలో అందని సలహాలు, సూచనలు



రామగుండం శివారులో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతు

రామగుండం: బహిరంగ మార్కెట్‌లో కాగుతున్న వంటనూనెల ధరలను సామాన్యులకు చేరువ చేయడం, రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడం లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఆయిల్‌పామ్ సాగు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడంలేదు. వంటల తయారీలో అధికంగా పామాయిల్ వినియోగిస్తున్నారు. అయితే, జనాభా అవసరాలకు సరిపడా నూనెగింజల దిగుబడి రావడం లేదు. బహిరంగ మార్కెట్‌లో నూనెలకు డిమాండ్ అధికంగా పెరుగుతోంది. దీంతో మలేషియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మయన్మార్, వియత్నాం, ఆస్ట్రేలియా, శ్రీలంక, మెక్సికో తదితర దేశాల నుంచి వంటనూనెలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ధరల పెరుగుదలకు ఇది ప్రధాన కారణమని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు.

రాయితీ పెంచినా ముందుకురాని రైతులు

- వంటనూనెల దిగుమతిని తగ్గించడం, స్థానికంగానూ వాటి దిగుబడి పెంచడంపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.
- ఇందులో భాగంగా పామాయిల్ సాగు చేయాలని నిర్దేశించింది.
- దీని సాగుకు అత్యధిక రాయితీ కల్పిస్తూ రైతులను ప్రోత్సహించాలని చూస్తోంది.
- ఈ పంట సాగుకు శ్రమ, వ్యయంతో తక్కువ. అధిక దిగుబడి వస్తుంది.
- అంతేకాదు.. ఇందులో అంతరపంటలు కూడా సాగుచేసే అవకాశం ఉంది.
- తద్వారా రైతులకు అదనపు ఆదాయం కూడా సమకూరుతుందని భావిస్తున్నారు.
- ప్రస్తుతం వ్యవసాయ రంగం విపత్కర వాతావరణ పరిస్థితులు ఎదుర్కొంటోంది.
- రైతులు పంటలు కోల్పోయి ఏటా అప్పుల పాలవుతున్నారు.
- అయితే, పామాయిల్ సాగుతో వారికి ఏటా స్థిరమైన ఆదాయ మార్గం చూపించడం కూడా ప్రభుత్వ మరో ఆశయం.

సాగు లక్ష్యం పదివేల ఎకరాలు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 14 మండలాల్లోని 266 గ్రామాల్లో సుమారు పదివేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. కానీ, ఇప్పటివరకు 805 ఎకరాల విస్తీర్ణంలోనే మొక్కలు నాటారు. మరో 1,839.14 ఎకరాల విస్తీర్ణంలో నాటేందుకు మొక్కలు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచారు. జిల్లాలో అత్యధికంగా ధర్మారం మండలంలో సుమారు 95.83 ఎకరాలు, అత్యల్పంగా ఎలిగేడు మండలంలో 25.4 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం పంట పండిస్తున్నారు. గతేడాది 2,600 ఎకరాలకు 1,252 ఎకరాల్లోనే పామాయిల్ పంట సాగుచేశారు.

సాగుకు అనువైన వాతావరణం

- వర్షాకాలంలో సాగుకు అనువైన వాతావరణం ఉంటుంది.
- అయితే, రైతులకు సాగుపై అవగాహన కల్పించేందుకు క్షేత్ర పర్యటనలు, అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అధికారులు.. ఆ దిశగా ఆశించిన ఫలితాలు సాధించడంలేదు.
- గతంలో ఉన్న హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ అధికారులను ప్రస్తుతం ప్రభుత్వం తొలగించడంతో సాగుపై రైతులకు అవగాహన కల్పించేవారు లేకుండాపోతున్నారు.

రైతుల వద్దకు చేరడంలేదు



పామాయిల్ సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నా.. అధికారుల కొరతతో రైతుల వద్దకు సకాలంలో చేరుకోలేకపోతున్నాం. నాకు ఏడు మండలాల ఇన్‌చార్జి బాధ్యతలు ఉన్నాయి. మారుమూల గ్రామాలకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. గతంలో నా పరిధిలో మండలాలకు హెచ్‌ఈఈలు పర్యవేక్షకులుగా ఉండేవారు. అప్పుడు కొంతవెసులుబాటు ఉండేది. అధికారుల కొరత తీర్చితే నిర్దేశిత లక్ష్యం సాధిస్తాం.

– శ్రీకాంత్‌యాదవ్, హార్టికల్చర్ అధికారి

అధికారుల కొరతతో..

జిల్లాలో 266 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇద్దరే హార్టికల్చర్ అధికారులు ఉన్నారు. ఫలితంగా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంలో చాలా జాప్యమవుతోంది. కనీసం మండలానికి ఒక అధికారిని నియమిస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని వారు అంటున్నారు.

రాజ్యాంగం తెలిస్తే తలరాతలు మారేవి

- సమాజ మార్పుకోసం పోరాటం చేస్తాం
- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు
- అంబేడ్కర్ చెరువులో విగ్రహాలు ఆవిష్కరణ




అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మధు

మంథని: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అందరికి తెలిసి ఉంటే తలరాతలు ఏనాడో మారేవని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. ఆదివారం రాత్రి పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చెరువులో అంబేడ్కర్, గౌతమ బుద్ధుడు, బొక్కలవాగు వంతెనపై మాజీ శాసనసభ్యుడు దివంగత గడిపెల్లి రాములు విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మధు మాట్లాడారు. అంబేడ్కర్ అందరివాడన్నారు. ఆయన ఎస్సీలు, బీసీల సంక్షేమం, అభివృద్ధి గురించి ఆలోచన చేశారని గుర్తుచేశారు. విగ్రహం అంటే ధైర్యం, సత్యం, పోరాటానికి సంకేతం, ఆత్మగౌరవానికి ప్రతీక అని వివరించారు. మంథని నియోజకవర్గంలో మహనీయుల చరిత్ర లిఖించలేదని, పేదల గురించి పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. ఒక నియోజకవర్గానికి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉంటారనే విషయం చాలామందికి తెలియకపోవడం బాధాకరమన్నారు. రాములు గురించి కూడా మంథని ప్రాంత ప్రజలకు తెలియదన్నారు. గడిపెల్లి రాములు హుజూరాబాద్, నందిమేడారం నుంచి శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహించారని, గుల్కోట శ్రీరాములు స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి మంథని శాసనసభ్యుడని, వారి విగ్రహాలను సైతం మంథనలో ఆవిష్కరించడం అదృష్టమన్నారు. మహనీయుల స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ పాలిస్తున్నారని చెప్పారు. సోమవారం నుంచి నియోజవకర్గంలో ప్రజా ఆశీర్వాద యాత్రకు శ్రీకారం చుడతానని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, బౌద్ధమత గురువులు పాల్గొన్నారు. కాగా మంథని మండలం గోపాల్‌పూర్, కాటారం మండలం దామెరకుంటకు చెందిన వారు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

రిటైర్డ్ ఉద్యోగులు సమాజసేవ చేయాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారంతా సమాజ సేవలో స్వచ్ఛందంగా పాలుపంచుకోవాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కోరారు. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో ఆదివారం జిల్లా అధ్యక్షుడు జీవన్‌రాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఉద్యోగ విరమణ పొందగానే తమకు వృద్ధాప్యం పైబడిందనే భావనకు రావొద్దని ఎమ్మెల్యే సూచించారు. తమకున్న ఆలోచనలకు అనుగుణంగా సమాజసేవలో పాలుపంచుకుంటే ఆరోగ్యంగా ఉండగలుగుతామనే విషయాన్ని గ్రహించాలని కోరారు. ప్రభుత్వం పింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని, హైదరాబాద్‌లో పెన్షన్ భవన్ కోసం వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించాలని నాయకులు కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



సుల్తానాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని డీఆర్డీవో శ్రీధర్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నీరుకుల్లలో ఆదివారం పరిశుభ్రతమపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రపరిచారు. అనంతరం డీఆర్డీవో మాట్లాడారు. తమ ఇంటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటారో.. అదేవిధంగా పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీపీ బాలాజీరావు, సర్పంచ్ కోటగిరి విజేందర్ గౌడ్, ఎంపీడీవో శశికళ, ఎంపీటీసీ శీలం శంకర్, కార్యదర్శి సురేందర్ పాల్గొన్నారు.

3న దేవునిపల్లి జాతర దుకాణాల వేలం

పెద్దపల్లిరూరల్: దేవునిపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరలో దుకాణాల నిర్వహణ కోసం అక్టోబరు 3న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ముద్దసాని శంకరయ్య ఆదివారం తెలిపారు. ఆసక్తిగలవారు కొబ్బరికాయలు, లడ్డూపులిహోర ప్రసాదాల అమ్మకాల కోసం రూ.50వేల చొప్పున, పేలాలు, పుట్నాల విక్రయాల కోసం రూ.లక్ష డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని సూచించారు. కార్తీక మాసంలో జరిగే జాతర సందర్భంగా ఈఏడాది నవంబర్ 25 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు అమ్మకాలు జరుపుకోవచ్చని వివరించారు. ఆసక్తిగల వారు రూ.100 చెల్లించి దరఖాస్తు ఫారం తీసుకోవాలని సూచించారు.

ఆటంకాలు లేకుండా శోభాయాత్ర



లడ్డూ స్వీకరిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి



గణేశుని శోభాయాత్రలో అధికారుల నృత్యాలు

- భక్తజనం, నిర్వాహకులు సహకరించాలి
- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి
- పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం

గోదావరిఖని: ఆటంకాలు లేకుండా వినాయకుని శోభాయాత్ర నిర్వహించుకోవాలని రామగుండం సీపీ రెమారాజేశ్వరి సూచించారు. పోలీస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో ఆదివారం గణేశుని నిమజ్జనోత్సవం నిర్వహించారు. డీసీపీలు వైభవ్ గైక్వాడ్, సుధీర్ కేకన్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారన్నారు. విఘ్నాలు లేకుండా తాము ప్రారంభించిన పనులు పూర్తయ్యేలా చూడాలని వినాయకుడికి పూజలు చేసినట్లు తెలిపారు. పోలీసుశాఖ సూచనలు పాటిస్తూ ఉత్సవాలు కొనసాగిస్తున్నారని అభినందించారు. ఇదే స్ఫూర్తితో నిమజ్జనం పూర్తయ్యేంత వరకూ సహకరించాలని కోరారు. ఏసీపీలు తుల శ్రీనివాస్‌రావు, ఎడ్ల మహేశ్, సదయ్య, మోహన్, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, ఏఆర్ ఏసీపీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర..

ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆరు రోజులపాటు విశేష పూజలు అందుకున్న గణనాథుని శోభయాత్రను సీపీ రెమా రాజేశ్వరి ప్రారంభించారు. డప్పుచప్పుళ్లు, పోలీసు అధికారులు, చిన్నారుల నృత్యాల మధ్య నిమజ్జన శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అనంతరం గోదావరినదిలో నిమజ్జనం చేశారు.

లైబ్రరీ భవన నిర్మాణం నిలిపివేయండి

- గ్రంథాలయాన్ని వేరేచోటుకు మార్చండి
- రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధుల డిమాండ్
- సీపీఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం



రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన గ్రంథాలయ భవనం పనులు వెంటనే నిలిపి వేయాలని వివిధ రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు అదేస్థలంలో కొత్త భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. బాలికల కళాశాల స్థలంలో గ్రంథాలయ భవన నిర్మాణాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించడం సరికాదని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు యాకయ్య, సదానందం విమర్శించారు. గ్రంథాలయ భవనాన్ని మరోచోట నిర్మించుకోవాలని సూచించారు. జిల్లాలోని పేద కుటుంబాల బాలికలకు ఉచితంగా ఇంటర్‌విద్య అందుతోందని, వారి చదువులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించడం తగదన్నారు. పనులు ప్రారంభించేందుకు వచ్చిన మంత్రి ఈశ్వర్‌ను కలిసేందుకు యత్నించిన విద్యార్థి సంఘాల నాయకులపై దాడులు చేయడం శోచనీయమన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు అన్ని వసతులతో కొత్తభవనం నిర్మించాలని, లేనిపక్షంలో అఖిల పక్షకమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాలు, పార్టీల నాయకులు అక్కపాక తిరుపతి, శ్రీనివాస్, సంపత్, శ్రీమన్నారాయణ, శారద, జిల్లాల ప్రశాంత్, సీపెల్లి రవీందర్, మోదంపల్లి శ్రావణ్, అశోక్, రామలక్ష్మి, బొబ్బిలి రాకేశ్ మల్యాల శివసాయి, మహేశ్, విద్యార్థినులు ప్రతిమ, ప్రవళిక, కావ్య, సాయి ప్రియ, రవళి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు మరో రూ.50కోట్లు

- త్వరలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్క్ పనులకు శంకుస్థాపన
- కుర్జికుమ్మి భూముల పట్టాలకు కూడా మోక్షం
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న చందర్

గోదావరిఖని: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కు మరో రూ.50కోట్లు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. తన జన్మదినం సందర్భంగా రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను ఆదివారం హైదరాబాద్ ప్రగతిభవన్‌లో కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల కోసం రామగుండం రావాలని మంత్రిని కోరారు. కార్పొరేషన్‌లో చేపట్టే అభివృద్ధి పనుల కోసం రూ.50కోట్లు మంజూరు చేయాలని విన్నవించారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి సోమవారం విడుదల చేసేందుకు అంగీకరించినట్లు ఎమ్మెల్యే చందర్ తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీన రామగుండం నియోజకవర్గానికి మంత్రి కేటీఆర్ వస్తున్న సందర్భంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ), అంతర్గాంలో ఇండస్ట్రియల్‌పార్క్ ప్రారంభించాలని, కుర్జికుమ్మి భూముల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో రూ.వంద కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కోరుకంటి చందర్ పేర్కొన్నారు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తుకు నేడు ఆఖరు

పెద్దపల్లిరూరల్: మైనార్టీ విద్యార్థులు సీఎం ఓవర్సీస్ పథకం ద్వారా ఉపకార వేతనాలు పొందేందుకు ఈనెల 25వ తేదీతో గడువు ముగుస్తుందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మెహరాజ్ మహమ్మద్ తెలిపారు. ఇంజినీరింగ్‌లో 60శాతం, డాక్టరేట్ చేసేందుకు పీజీలో 60శాతం మార్కులు సాధించి, ఈ ఏడాది జూలై ఆఖరునాటి విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందినవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. వివరాలకు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

దివ్యాంగ విద్యార్థులకోసం..

ప్రీ మెట్రిక్ చదివే దివ్యాంగ విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం అక్టోబర్ 31లోగా దరఖాస్తు చేయాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి రవుఫ్‌ఖాన్ తెలిపారు.

క్లుప్తంగా

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడి మృతి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దాసరి

సుల్తానాబాద్(సుల్తానాబాద్): పూసాలకుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నల్ల పోచాలు(52) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని పోచాలు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్‌రావు, నాయకులు రమణ, వలస నీలయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

మంథని: అంగన్‌వాడీ ఉద్యోగులపై భాష్పవాయువు ప్రయోగించి, గుర్రాలతో తొక్కించిన చంద్రబాబునాయుడు ప్రస్తుతం జైలులో ఊచలు లెక్క పెడుతున్నారని, ప్రస్తుత ప్రభుత్వం అలాంటి చర్యలకు పూనుకోకుండా తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలని సింగేరణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి అన్నారు. పట్టణంలో అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. రాష్ట్రంలో అనేకమంది నియంత సీఎంలకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర సీఐటీయూకు ఉందన్నారు. అంగన్‌వాడీల సమ్మెను ప్రభుత్వం విచ్ఛిన్నం చేయడం సరికాని అన్నారు. ఐసీడీఎస్‌లో 90శాతం మంది దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల వారే ఉన్నారన్నారు. అందులో 100శాతం మంది మహిళలే ఉన్నారని, వారిపై కర్కశంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. నాయకులు సారయ్య, సురేశ్, రమేశ్, బూడిద గణేశ్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వనజరాణి తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కుల సాధనకు పోరాటం

మంథని: రాజకీయ పార్టీలకు అతీతంగా దళితుల హక్కుల సాధనకు పోరాటాలు చేస్తానని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్ల నాగరాజు అన్నారు. దళితుల సమస్యలపై ఇటీవల కేంద్ర మంత్రులు, జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలిసినట్లు నాగరాజు ఆదివారం తెలిపారు. రాష్ట్రం, జిల్లాలో దళితులు ఎవరైనా సమస్యలు ఉంటే ప్రత్యక్షంగా తనను కలవాలని కోరారు. దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన అన్నారు

మట్టి దందాను అడ్డుకున్న బీఎస్పీ నాయకులు

ఎలిగేడు(పెద్దపల్లి): శివపల్లి గ్రామంలోని బోడగుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, టిప్పర్లను బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష కార్యకర్తలతో కలిసి అడ్డుకున్నారు. అనంతరం ఈ విషయంపై అధికారులకు సమాచారం చేరవేశారు. దీంతో జూలపల్లి పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని జేసీబీని స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమ రవాణా చేయొద్దని సూచించారు.

ఎల్లలు దాటొస్తున్న గంజాయి

- 'ఇటీవల కరీంనగర్‌కు చెందిన ఓ యువకుడు తన వాహనంపై భద్రాచలం అటవీ ప్రాంతానికి వెళ్లి, గంజాయి తరలిస్తుండగా మార్గమధ్యలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డాడు. ఇలా చాలా మంది కరీంనగర్ యువకులు గంజాయి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నట్లు సమాచారం.'
- 'నాలుగు రోజుల క్రితం కరీంనగర్ మండలానికి చెందిన 10 మంది యువకులు ఒడిశా, చత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి గంజాయి రవాణా చేస్తూ ఒడిశా పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది.'

- ఇతర రాష్ట్రాల నుంచి గుట్టుగా కరీంనగర్‌కు దిగుమతి
- ఒడిశా పోలీసులకు చిక్కిన 10 మంది యువకులు?


ఇటీవల పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)

కరీంనగర్ క్రైం: వివిధ రాష్ట్రాల నుంచి కరీంనగర్‌కు గంజాయి దిగుమతి అవుతోంది. ఎల్లలు దాటి గంజాయి రవాణా చేస్తూ కరీంనగర్‌కు చెందిన పలువురు యువకులు ఇతర రాష్ట్రాల పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మొదట ఫ్యాషన్‌గా ప్రారంభించి, తర్వాత బానిసలుగా మారి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గంజాయి సేవించడంతోపాటు జల్సాల ఖర్చుల కోసం దాన్ని వ్యాపారంగా మార్చుకొని, చాలా మంది యువకులకు అలవాటు చేస్తున్నారు. ఎక్కువ శాతం కళాశాల విద్యార్థులు, పలుచోట్ల మైనర్లు, కార్మికులకు విక్రయించి, డబ్బులు దండుకుంటున్నారు.

మన రాష్ట్రంలో దొరక్కపోవడంతో..

మన రాష్ట్రంలో గంజాయి దొరక్కపోవడంతో ఎక్కువ శాతం మంది పక్క రాష్ట్రాల మీద దృష్టి పెడుతున్నారు. పలు రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు దిగుమతి అవుతోంది. అయితే అక్కడ కొనుగోలు చేస్తే రేటు ఎక్కువగా ఉంటుందని నేరుగా ఒడిశా, చత్తీస్‌గఢ్, కర్నాటకలోని బీదర్, ఆంధ్ర ప్రదేశ్‌లోని అరకు సమీప ప్రాంతాలు, విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాలు, సీలేరుకు వెళ్లి, కరీంనగర్‌కు తీసుకువస్తున్నారు. గతంలో పలువురు పోలీసులకు చిక్కడమే ఇందుకు ఉదాహరణ.

యువతే టార్గెట్..

గంజాయి వ్యాపారులు యువతనే టార్గెట్ చేస్తున్నారు. కరీంనగర్ పట్టణంతోపాటు జిల్లాలోని పల్లెల్లోనూ గంజాయి గుప్పుమంటోంది. సాయంత్రం అయిందంటే చాలు నిర్మానుష్య ప్రాంతాల్లో ఎక్కువ మంది గంజాయి సేవిస్తున్నారు. మూతపడిన దుకాణాలు, వాగుల పరిసరాలు, శివారు ప్రాంతాలు, వాడుకలో లేని భవనాల్లో ఇది గుట్టుగా సాగుతోంది. పోలీసులు తనిఖీలు చేసి, నియంత్రించినా చాప కింద నీరులాగా గంజాయి విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. కళాశాల విద్యార్థులు, కొంతమంది మైనర్లు, కార్మికులు గంజాయికి అలవాటు పడి, తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన డప్పు కళాకారులు


గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: స్థానిక మార్కండేయకాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మాదిగ మహాశక్తి సభలో రామగుండం నియోజకవర్గ డప్పు కళాకారులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దూడపాక సతీశ్, బోయిన రాజు, జక్కన్నపల్లి రమేశ్, చిలుముల ఎల్లయ్య, మణికంఠ సంపత్, మొగిలి, నేర్పటి మల్లయ్య, అంబాల మధునయ్య, చిలుముల వెంకటస్వామి, వాసాల రాజయ్య, సుందిళ్ల రాజేశం, శంకర్ తదితరులు ఉన్నారు.

'ఉత్తమ ఉపాధ్యాయుడు వేధిస్తున్నాడు'

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని పేర్కొంటూ ఓ ఉపాధ్యాయిని డీఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని బాధితురాలు ఆదివారం తెలిపారు. తనవైపు తదేకంగా చూస్తున్నాడని, అసహ్యంగా ప్రవర్తిస్తున్నాడని, ద్వంద్వార్థాలు వచ్చేలా మాట్లాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉపాధ్యాయుడి వేధింపుల విషయాన్ని ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన చెందింది. ఉపాధ్యాయుడితో కలిసి హెచ్‌ఎం కూడా తనను మానసికంగా వేదనకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో వివరించారు. విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని విన్నవించారు. ఈవిషయంపై సదరు ఉపాధ్యాయుడిని సంప్రదిస్తే.. ఉపాధ్యాయురాలు తనపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. తనకు అవార్డుల రూపంలో గుర్తింపు వస్తుందనే అక్కసుతోనే ఇలాంటి అనవసర ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఇదేవిషయంపై డీఈవోను సంప్రదించేందుకు యత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

అలంకారప్రాయంగా ఆర్ అండ్ బీ అతిథి గృహం

- ఫర్నీచర్ కొనుగోలుకు నిధుల కొరత..!


ఆర్‌అండ్ బీ అతిథి గృహం

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలో రూ.కోటిన్నర వెచ్చించి ఆధునిక హంగులతో నిర్మించిన భవనం అలంకారప్రాయంగానే మిగిలింది. రూ.కోట్లు వెచ్చించి భవనం నిర్మించిన పాలకులు.. రూ.లక్షలు వెచ్చించి అవసరమైన ఫర్నీచర్ సమకూర్చలేకపోతున్నారు. దీంతో విశ్రాంతి కోసం ప్రజాప్రతినిధులు, మంత్రులు ఆగితే.. స్థానికంగా ఉన్న అధికారులకు అందులో వసతి కల్పించలేక అవస్థలు పడుతున్నారు. కేవలం రెండు బెడ్‌లను మాత్రమే కొనుగోలు చేసిన అధికారులు.. కొంత పాత ఫర్నీచర్‌తోనే నెట్టుకొస్తున్నారు. నిధుల కొరతతోనే బోర్డు కూడా ఏర్పాటు చేయలేకపోతున్నామని ఓ అధికారి తెలిపారు. ఆర్ అండ్ బీ అతిథి గృహాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మిస్తే ఆదాయం..

పట్టణంలోని ప్రధాన రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న ఆర్ అండ్ బీ అతిథి గృహం ఎదుట షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే ప్రభుత్వానికి రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుందని, పాలకులు, అధికారులు ఈ దిశగా చొరవ చూపాలని పట్టణవాసులు కోరుతున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని ప్రభుత్వజూనియర్ కాలేజీ, ప్రభుత్వ ఆస్పత్రి స్థలాల్లో నిర్మించినట్లుగా బీవోటీ పద్ధతిన నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.

రాజేందర్‌కు పురస్కారం


అవార్డుపత్రం అందిస్తున్న ప్రతినిధులు

ధర్మారం: మండల కేంద్రానికి చెందిన తన్నీరు రాజేందర్‌ను బహుజన సాహిత్య అకాడమీ బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డుకు ఎంపికచేశారు. ఈమేరకు అవార్డు ఆహ్వాన పత్రాన్ని ఆదివారం అందించారు. లయన్స్‌క్లబ్, జర్నలిజం ద్వారా విశేష సేవలందించినందుకు గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ.. నేషనల్ అవార్డుకు ఎంపిక చేసినట్లు సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ తెలిపారు. అక్టోబర్ 15న న్యూఢిల్లీలో జరిగే నాలుగో జాతీయ కన్వరెన్స్‌లో అవార్డు అందించనున్నట్లు ఆయన వివరించారు.

కనీస వేతనాలు చెల్లించండి


కార్మికులతో కడారి సునీల్

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్
- నేడు కలెక్టరేట్ ముట్టడికి కార్యాచరణ

సుల్తానాబాద్(పెద్దపల్లి): మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమల చేయాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ ముట్టడిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ తెలిపారు. పట్టణంలో ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశమయ్యారు. వారు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడారు. తొలుత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్మికులకు బీమా, జనశ్రీ ప్రమాద బీమా సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తోడేటి లావణ్య, లీలావతి, రత్నమాల, లక్ష్మి, హలిమ, శారద, విజయ, సాయి శృతి, రజిత, లింగయ్య, గుర్రం సాయి, మొండయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలొచ్చాయి


గోదాంలో చీరల నిల్వలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): బతుకమ్మ చీరలు జిల్లాకు చేరాయి. తొలివిడతలో 1.50,000 చీరలు రాగా పెద్దపల్లి మార్కెట్ గోదాములో నిల్వచేస్తున్నారు. ఆహారభద్రత కార్డు కలిగి, 18 ఏళ్ల వయసు నిండిన వారికి బతుకమ్మ పండుగ కోసం వీటిని అందిస్తారు. జిల్లాలో రేషన్‌కార్డుల ఆధారంగా 2,77,311 మంది మహిళలు ఉన్నారని అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని 267 గ్రామపంచాయతీలు, పెద్దపల్లి ,సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు, రామగుండం కార్పొరేషన్‌లో 417 మంది రేషన్ డీలర్ల సహకారంతో బతుకమ్మ చీరలు పంపిణీ చేసేందుకు ఉన్నతాధికారులు కసరత్తు ప్రారంభించారు. పైనుంచి ఆదేశాలు రాగానే వీటిని పంపిణీ చేస్తారు.

ఆదేశాలు రాగానే పంపిణీ



బతుకమ్మ చీరల పంపిణీకి తేదీలు ఖరారు కాలేదు. ఆదేశాలు రాగానే గ్రామాల వారీగా పంపిణీ చేస్తాం. 18ఏళ్ల పైబడిన యువతులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తాం. ప్రభుత్వం ఇప్పటివరకు 1,50,000 చీరలు పంపిణీ చేసింది. మరిన్ని రావాల్సి ఉంది. – శ్రీధర్, డీఆర్డీవో

బొగ్గుబాయి వార్తలు

సింగరేణిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి


మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో రూల్ ఆఫ్ రిజరేషన్ పాటించాలని ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేస్ 1630/82 నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్జీ–1 ఏరియాలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మెరిట్‌లో వచ్చినా.. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో చూపెట్టి రిజర్వేషన్ పాలసీకి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ జీవోలను తప్పక అమలు చేస్తూ ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు మెరిట్‌లో వస్తే వారిని మెరిట్‌లోనే పరిగణించాలని, ఆ తర్వాత రిజర్వేషన్ కోటా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈవిషయంలో గతంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఏరియా ఉపాధ్యక్షుడు జనగామ నర్సయ్య, కార్యదర్శి బడికిల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం


టేబుల్ టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 ఏరియాలో ఇంటర్‌ఏరియా టేబుల్ టెన్నిస్, షెటిల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ప్రారంభమైయ్యాయి. కార్యక్రమంలో ఆర్జీ–1 ఏరియా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ గౌరవ కార్యదర్శి బంగారు సారంగపాణి, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ రమేశ్, కో ఆర్డినేటర్ రాజయ్య, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పదోన్నతి, ఇంక్రిమెంట్ ఇవ్వాలి


వినతిపత్రం అందిస్తున్న జమేదార్లు

గోదావరిఖని: సింగరేణి సెక్యూరిటీ జమేదార్, ఇన్‌స్పెక్టర్ పదోన్నతి ఇంక్రిమెంట్లు అందజేయాలని కోరుతూ ఆదివారం డైరెక్టర్(పా) బలరాంకు విన్నవించారు. స్థానిక ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో ఆయనను సెక్యూరిటీ ఉద్యోగులు కలుసుకుని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అన్ని ఏరియాల జమేదార్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

జనక్‌ప్రసాద్‌కు టికెట్ ఇవ్వండి

- లేకుంటే సహాయ నిరాకరణే
- ఐఎన్‌టీయూసీ వర్కింగ్ కమిటీలో ఏకగ్రీవ తీర్మానం


హాజరైన నాయకులు

గోదావరిఖని: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం కాంగ్రెస్ పార్టీ టికెట్ ఐఎన్‌టీయూసీ కోటాలో జనక్‌ప్రసాద్‌కు కేటాయించకపోతే సింగరేణి వ్యాప్తంగా ఉన్న 12 డివిజన్లలో సహాయ నిరాకరణ చేస్తామని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆదివారం స్థానిక జనక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన వర్కింగ్ కమిటీ సమావేశంలో ఈమేరకు నిర్ణయించారు. ఈసందర్భంగా ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, ఎన్టీపీసీ నాయకులు బాబర్‌సలీం పాషా, ఏపీ, టీఎస్ ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మికక్షేత్రం అయిన రామగుండంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఐఎన్‌టీయూసీకి ఇవ్వాలన్నారు. కోల్‌బెల్ట్ వ్యాప్తంగా సింగరేణి కార్మికుల ఓట్ల ప్రభావం 12 అసెంబ్లీ, 4పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఉంటుందని తెలిపారు. గత ఎన్నికల్లో 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు 7అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించారని గుర్తుచేశారు. అంతేకాకుండా ఐఎన్‌టీయూసీ ప్లీనరీలో దేశంలో జరిగే అన్నిఎన్నికల్లో సీట్ల కేటాయింపులో ఐఎన్‌టీయూసీకి సముచిత స్థానం ఉంటుందని రాహుల్ గాంధీ వాగ్దానం చేశారని గుర్తుచేశారు. సమావేశంలో నాయకులు నర్సింహారెడ్డి, గుమ్మడి కుమారస్వామి, ధర్మపురి, త్యాగరాజన్, కాంపెల్లి సమయ్య, జెట్టి శంకర్‌రావు, పసునూటి రాజేందర్, కలవేన శ్యామ్, వడ్డేపల్లి దాస్, రాంశెట్టి నరేందర్, వికాస్‌కుమార్ యాదవ్, రవీందర్‌రెడ్డి, 12 ఏరియాల బ్రాంచ్ కమిటీ నాయకులు, పిట్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సేవ చేయకుండా కుట్రలు

- అర్థం చేసుకుని ఆదరించండి
- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు

మంథని: పేదబిడ్డగా తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే అనేక సేవా కార్యక్రమాలతో వారికి దగ్గరైతే ఓర్వలేక నోట్ల సంచులతో వచ్చి తనను దూరం చేశారని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. స్థానిక ఎస్‌ఎల్‌బీ గార్డెన్‌లో ఆదివారం పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవలు పొందిన వారితో ఏర్పాటు చేసిన 'మీ సేవ మా అదృష్టం' కార్యక్రమంలో పుట్ట మధు మాట్లాడారు. పేద యువతుల వివాహం, కళాశాలల్లో మధ్యాహ్న భోజనం, చిన్నారుల చదువులకు సాయం, ఆస్పత్రుల్లో మంచి వైద్యం అందించామని తెలిపారు. తాను ఇన్నిచేసినా ప్రజలు ఆలోచన చేయకపోవడం బాధాకరమన్నారు. మళ్లీ ఎన్నికలు వస్తున్న క్రమంలో ప్రజలకు దూరం చేయాలనే కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. అబద్ధాలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నవారు ఏదోచేస్తారని నమ్మవద్దని ప్రజలను కోరారు. అనేక సంవత్సరాలు ఒకేకుటుంబం నియోజకవర్గాన్ని పాలించినా మన గురించి ఆలోచన చేయలేదని విమర్శించారు. ఈనాడు ఎమ్మెల్యేగా ఉంటూ, రూ.2.75లక్షల జీతం తీసుకుంటూ ఏ ఒక్కరికి రూపాయి సా యం చేయడం లేదని దుయ్యబట్టారు. మున్సి పల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

మైనార్టీలకు పెద్దపీట

రామగిరి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని జెడ్పీ చైర్మన్ పుట్ట మదు అన్నారు. సెంటనరీకాలనీ జామా మసీద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీ సన్మానంలో ఆయన మాట్లాడారు. పండుగలు, శోభాయాత్రలను అన్నివర్గాలు ఐక్యంగా నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. ఖబరాస్థాన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాయకులు శంకేషి రవీందర్, కుమార్ యాదవ్, ఎండీ మంజూర్, ఎండీ ముజీబ్, ఎండీ జాఫర్, ఎండీ ఆలీమ్, సుభాన్‌ఖాన్, అల్లం తిరుపతి, దామోర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దళితులను మోసం చేస్తున్న ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు


మాట్లాడుతున్న విజయరమణారావు

ఎలిగేడు(పెద్దపల్లి): తొమ్మిదిన్నరేళ్లుగా అధికారంలో కొనసాగుతున్న బీఆర్‌ఎస్ దళితులను అడుగడుగునా మోసం చేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు విమర్శించారు. నర్సాపూర్‌లో ఆదివారం గడప గడపకు కాంగ్రెస్ పార్టీ, పల్లె పల్లెకు విజ్జన్న కార్యక్రమం నిర్వహించారు. విజయరమణారావు మాట్లాడుతూ, ఇటీవల తుక్కుగూడలో జరిగిన విజయభేరి సభలో పార్టీ అధినేత సోనియాగాంధీ పలు వరాలు ప్రకటించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుభరోసా ద్వారా రైతు, కౌలురైతులకు ఏటా రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు కూ.12వేలు, వరి పంటకు రూ.500 బోనస్ అందిస్తామన్నారు. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, గృహజ్యోతి ద్వారా ప్రతీ కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, పేదలకు ఇంటిస్థలంతోపాటు నిర్మాణానికి రూ.5లక్షల సాయం, ఎస్సీలకు రూ.6లక్షలతోపాటు ఇంటిస్థలు అందిస్తామని తెలిపారు. ఉద్యమకారులకు 250చదరపు గజాల ఇంటి స్థలం కేటాయిస్తూ, చేయూత పథకం ద్వారా రూ.4వేల పింఛన్ అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు పల్లెర్ల వెంకటేశ్, నరహరి సుధాకర్‌రెడ్డి, రాపోలు శ్రీనివాస్, రవీందర్, అమ్ముల శ్రీనివాస్, రాజు, అమ్ముల రాయమల్లు, ఎండీ రఫీ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీమాతో కార్మికులకు ధీమా

- 16 – 60ఏళ్ల వారు అర్హులు
- లబ్ధిదారు ఖాతాలోకే నేరుగా సొమ్ము



పెద్దపల్లిరూరల్: భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మిక కుటుంబాల్లో భరోసా నింపేందుకు ప్రభుత్వం బీమా పథకం ధీమా ఇస్తోంది. చిన్నమొత్తం చెల్లింపుతో ప్రతీ కార్మికుడు పాలసీ చేసేలా చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని 14 మండలాల్లో వేలాది మంది కార్మికులు ఉన్నారు.

వీరే అర్హులు..

- భవన, ఇతర నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు ఈ పథకానికి అర్హులు.
- 16 – 60 మధ్య వయసు వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి.
- ఏడాదిలో కనీసం 90 రోజులు తప్పనిసరిగా పనిచేసి ఉండాలి.
- కార్మికశాఖ అధికారి ధ్రువీకరణతో మీసేవ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలి.
- పూర్తివివరాలు నమోదు చేసి ఐదేళ్ల కాలానికి రూ.60, నమోదుకు రూ.50 మొత్తం రూ.110 ప్రీమియం చెల్లించాలి.
- ప్రభుత్వ ఉద్యోగులుకాని ప్రతిఒక్కరూ తమ పేర్లను ఈ–శ్రమ్ పథకంలో నమోదు చేసుకుని కార్డు పొందాలి.

అనేక రకాలుగా లబ్ధి..

బీమా పథకంలో చేరిన కార్మికుల కుటుంబాలకు పలు రకాలుగా లబ్ధి చేకూరేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. యువతి పెళ్లికి రూ.30 వేలు అందిస్తోంది. ప్రసూతి సాయం కోసం రూ.30వేలు సమకూరుస్తోంది. ప్రమాదంలో శాశ్వత వైకల్యానికి గురైతే రూ.రూ.5లక్షల వరకు, ప్రమాదంలో మరణిస్తే రూ.6లక్షలు, సహజ మరణానికి రూ.లక్ష బీమా సౌకర్యం కల్పిస్తోంది. అంత్యక్రియల కోసం రూ.30వేలు ఇస్తోంది. ప్రమాదంలో గాయపడి వైకల్యానికి గురైతే తీవ్రతను బట్టి ఉపకరణాల కోసం ఆర్థికసాయం అందిస్తోంది. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఈ – శ్రమ్ పథకం ద్వారా రూ.2లక్షలు, గాయపడితే రూ.లక్ష సాయం అందిస్తోంది.

లబ్ధిదారు ఖాతాలోకే సొమ్ము

కార్మిక సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాల కింద అందే పరిహారం నేరుగా లబ్ధిదారు బ్యాంకు ఖాతాలోనే జమ అవుతోంది. కార్మిక కుటుంబాలకు అండగా ఉండేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. అర్హులైన వారంతా మీసేవ కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలి.

– రామ్మోహన్, జిల్లా కార్మికశాఖ అధికారి